Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# మెకానిక్ గురూ

* నా ఉద్యోగరీత్యా నేను బండి మీద రోజూ 74 కిలోమీటర్లు ప్రయాణిస్తాను. ఈ రోడ్డు మొత్తం బాగా ఎత్తుపల్లాలతో ఉంటుంది. పల్లం వచ్చినపుడు బైక్ క్లచ్ పట్టుకోవడం వల్ల పెట్రోల్ సేవ్ అవుతుందా? మైలేజీ పెరగాలంటే ఇలాంటి రోడ్లపై ఎలాంటి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి?

- సీహెచ్ సుధాకర్, ఈమెయిల్

వాహనం నడిపే విధానం, బండి నిర్వహించే తీరు, రోడ్డు కండీషన్ ఈ మూడు విషయాలపై వాహనం మైలేజీ ఆధారపడి ఉంటుంది. మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ రోడ్డు బాగాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో వేగం ఎప్పుడూ అదుపులో ఉండాలి. అనవసరంగా బ్రేక్ వేయడం తగ్గించాలి. బండి స్లో చేసినపుడు క్లచ్‌ని జాగ్రత్తగా వాడుతుండాలి. క్లచ్ ప్రమేయం లేకుండా వేగం పెంచాలి. యాక్సిలరేటర్ ఇచ్చినపుడు బ్రేక్ తొక్కకూడదు. ఇలా చేస్తుంటే మైలేజీ పెరుగుతుంది. అలాగే వాహనాన్ని కూడా మంచి కండీషన్‌లో ఉంచుకోవాలి.

* కార్లలో ఉన్నట్టే ద్విచక్రవాహనాల్లోనూ ఏమేం సేఫ్టీ ఫీచర్లుంటాయి? ఈమధ్యకాలంలో బైక్‌ల్లో కూడా ఎయిర్‌బెలూన్లు రాబోతున్నాయి అని విన్నాను. ఇది నిజమేనా? ఈ మోడల్ ఎప్పుడు మార్కెట్లోకి వస్తోంది.

- ఎల్.వినీత, వైజాగ్

చాలా ఏళ్ల నుంచి ద్విచక్రవాహనాల్లో ఒక్కటొక్కటిగా భద్రతా ఫీచర్లు అమలు చేస్తూ వస్తున్నారు. హోండా కంపెనీ మొదటిసారి కంబైన్డ్ బ్రేకింగ్ సిస్టమ్ (సీబీఎస్) అందుబాటులోకి తెచ్చింది. ముందు, వెనక.. రెండింట్లో ఏ బ్రేక్ వేసినా సీబీఎస్ రెండు బ్రేక్‌లకు సమానమైన శక్తిని అందించి త్వరగా బ్రేక్ పడేలా, వాహనంపై నియంత్రణ కోల్పోకుండా చేస్తుంది. 125సీసీ లోపు అన్ని ద్విచక్రవాహనాల్లో ఏప్రిల్ 1, 2019 నుంచి ఈ ఫీచర్ తప్పనిసరిగా ఉండాలంటోంది ప్రభుత్వం. ఇక 125సీసీ పైన ద్విచక్రవాహనాల్లో యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్) తప్పనిసరి. హోండా కంపెనీ 2016లోనే గోల్డ్‌వింగ్ మోటార్‌సైకిల్‌కి ఎయిర్‌బ్యాగ్ ఫీచర్ అందుబాటులోకి తెచ్చింది. కానీ సాంకేతిక సమస్యలు తలెత్తి ఆ బైక్‌లన్నింటినీ రీకాల్ చేశారు. భారత్‌కి చెందిన 'గ్రాండ్ పిట్‌స్టాప్' అనే అంకుర సంస్థ మరింత మెరుగైన బైక్ ఎయిర్‌బ్యాగ్ మోడల్‌పై పేటెంట్ దక్కించుకుంది. ఇది వచ్చే ఏడాది అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది. రైడర్ సూట్‌లోనే ఎయిర్‌బ్యాగ్‌లుండే టెక్నాలజీ మోటోజీపీలో అందుబాటులో ఉంది.

* నేను బీఎస్ 4 కారు కొనాలనుకుంటున్నాను. కానీ ఈ ఏడాది నుంచి బీఎస్ 6 ఇంధనం అమల్లోకి వస్తుందని తెలిసింది. దీనివల్ల నాకు ఏదైనా ఇబ్బంది కలుగుతుందా? లేదంటే కొన్నాళ్లు ఆగి బీఎస్ 6 కారే తీసుకొమ్మంటారా?

- జలంధర్, ఈమెయిల్

బీఎస్ 4 కార్లకన్నా బీఎస్ 6 వాటికి ధర ఎక్కువ. కాలుష్యం తగ్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బీఎస్ 6 నిబంధనలు తీసుకొచ్చింది. అయినప్పటికీ బీఎస్ 4 కార్లలో బీఎస్ 6 ఇంధనం వాడినా ఎలాంటి నష్టం కలగదు. కాబట్టి మీరు నిశ్చింతగా బీఎస్ 4 కారు కొనుక్కోవచ్చు. భవిష్యత్తులోనూ ఎలాంటి ఇబ్బంది కలగదు.

(మీకు ఇలాంటి సమస్యలు, సందేహాలుంటే రాసి పంపండి. నిపుణులతో సమాధానాలు ఇప్పిస్తాం)

---

- హర్షిన్ లాల్‌పేట్, ఆటోమొబైల్ నిపుణుడు

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org